# ఆడబిడ్డల కష్టాలను తీర్చిన 'కల్యాణలక్ష్మి'

- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 17: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం ఆడబిడ్డలు ఉన్న పేద కుటుంబాల కష్టాలు తీరుస్తున్నదని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆడబిడ్డల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. అనేక సంక్షేమ పథకాలను అమలుచేసి పేదలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. నియోజకవర్గంలోని బాన్సువాడ పట్టణంతోపాటు రూరల్, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల పరిధిలోని 118 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బాన్సువాడలోని తన అధికారిక నివాసంలో ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. రాష్ట్రంలో 70 శాతం మధ్యతరగతి ప్రజలే ఉన్నారని, ఆడబిడ్డల పెండ్లి చేయాలంటే బంగారం లేదా ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులను గమనించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. కల్యాణలక్ష్మి పథకాన్ని తెచ్చారని తెలిపారు. ఈ పథకం కింద నియోజకవర్గ పరిధిలో 15వేల కుటుంబాలకు రూ. 130 కోట్లు పంపిణీ చేశామన్నారు. బాన్సువాడ పట్టణంలో రూ. 20 కోట్లతో 100 పడకల మాతా-శిశు దవాఖాన నిర్మించి కార్పొరేట్ దవాఖానలకు దీటుగా సౌకర్యాలు కల్పించామని వివరించారు. నాణ్యమైన సేవలు అందించడంతో స్థానికులతోపాటు చుట్టుపక్కల మూడు నియోజకవర్గాల ప్రజలు ప్రసవం కోసం ఎంసీహెచ్‌కు వస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు ప్రభుత్వ దవాఖానలో నెలకు వందలోపే ప్రసవాలు జరిగేవని, ఇప్పుడు ప్రతి నెలా 500 డెలివరీలు చేస్తున్నారని గుర్తుచేశారు. రోజు రోజుకూ సమాజంలో మానవీయ కోణం లోపిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిదులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రాజకీయ కుట్రతోనే దుష్ప్రచారం

- నా రైస్‌మిల్లుల్లో అక్రమాలు జరుగలేదు..
- రెండు సీజన్లుగా సీఎంఆర్ తీసుకోలేదు
- కొన్ని ఛానళ్లు, పత్రికల్లో అసత్య కథనాలు
- బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్



బోధన్, డిసెంబర్ 17: బోధన్ మండలం తగ్గెల్లి గ్రామంలోని తన రైస్‌మిల్లుల్లో సీఎంఆర్‌కు సంబంధించి ఎలాంటి అక్రమాలు జరుగలేదని స్థానిక మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ స్పష్టం చేశారు. రాజకీయ కక్షతోనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎంఆర్ కింద ప్రభుత్వం కేటాయించిన ధాన్యం లెక్కల్లో అక్రమాలు జరిగాయంటూ కుట్రపూరితంగా కొన్ని టీవీ ఛానళ్లు, పత్రికలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో సెల్‌ఫోన్‌లో మాట్లాడారు. తన రైస్‌మిల్లుల్లో ఎలాంటి అక్రమాలు జరుగలేదని, ఈ విషయమై గతంలో కొందరు ఆరోపణలు చేయగా పౌరసరఫరాలశాఖ క్లీన్‌చిట్ ఇచ్చిందని గుర్తుచేశారు. తన రెండు రైస్‌మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ ధాన్యం తీసుకోలేదని, అలాంటప్పుడు అక్రమాలకు అవకాశం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ప్రజల్లో తనకున్న ఆదరణను చూసి కొందరు కాంగ్రెస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. ప్రస్తుతం కూడా తన రైస్‌మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ ధాన్యం కేటాయింపు జరుగలేదని, కిలో బియ్యం కూడా దుర్వినియోగం కాలేదని షకీల్ స్పష్టం చేశారు. ఒకవేళ తన రైస్‌మిల్లుల్లో ఏవైనా అక్రమాలు జరిగితే పౌరసరఫరాలశాఖ అధికారులు నోటీసులు ఇస్తారు కదా అని ప్రశ్నించారు. ఎలాంటి తప్పు జరుగనందునే ఒక్క నోటీసు కూడా రాలేదని షకీల్ తెలిపారు. తన రైస్‌మిల్లులపై విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని తానే అధికార యంత్రాగాన్ని గతంలో డిమాండ్ చేశానన్నారు. దీంతో జిల్లా అధికారులు విచారణ చేపట్టి తనకు క్లీన్‌చిట్ ఇచ్చారన్నారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ కూడా తనవద్ద ఉన్నాయన్నాని తెలిపారు. తన రైస్‌మిల్లుల్లో ఒక్క గింజ కూడా సీఎంఆర్ లేదంటూ అధికారులు ' నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్' ఇచ్చారని వెల్లడించారు. తాను ఎమ్మెల్యేగా పది సంవత్సరాలు ఉన్నప్పటికీ తనను ఎవరూ ఇబ్బంది పెట్టలేదని ఈ సందర్భంగా షకీల్ అన్నారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా బతికే కొంతమంది తనను రాజకీయంగా దెబ్బతీసేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

**పరువు నష్టం దావా వేస్తా..**

తన రైస్‌మిల్లులకు సంబంధించి తప్పుడు ప్రచారం చేసిన టీవీ ఛానళ్లు, పత్రికలపై పరువునష్టం దావా వేస్తానని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ హెచ్చరించారు. సోమవారం నోటీసులను పంపుతామన్నారు. అసత్య ప్రచారాలు చేసే వ్యక్తులను కూడా తాను వదలబోనని షకీల్ తెలిపారు.

నిజాంసాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు



## కొనసాగుతున్న నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్, డిసెంబర్17: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి పంట సాగు కోసం ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగుతున్నదని ఏఈ శివకుమార్ తెలిపారు. మూడు రోజుల క్రితం ప్రారంభించిన నీటి విడుదల ప్రస్తుతం 1700 క్యూసెక్కుల చొప్పున కొనసాగుతున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు (17.80 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1403.52 అడుగుల (15.69 టీఎంసీలు) మేర నీరు నిల్వ ఉన్నదని తెలిపారు. నాలుగు రోజులుగా ఆయకట్టుకు 0.47 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉండడంతో యాసంగి పంటల సాగుకు ఢోకా లేదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



వేడుకల్లో తొగుట పీఠాధిపతి మధుసూదానంద సరస్వతీ స్వామీజీ, ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహరాజ్

## ఘనంగా లింగేశ్వర గుట్ట ఆశ్రమ వార్షికోత్సవం

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 17 : నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్లారం శివారులో ఉన్న శ్రీలింగేశ్వర గుట్ట ఆశ్రమ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహరాజ్ ఆధ్వర్యంలో 251 జంటలు కుంకుమార్చన నిర్వహించాయి. శివాలయంలో బిల్వార్చన, అభిషేకం తదితర కార్యక్రమాలు కొనసాగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా తొగుట పీఠాధిపతి మధుసూదానంద సరస్వతీ స్వామీజీ హాజరై భక్తులకు ప్రవచనాలు బోధించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భకులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



కుంకుమార్చనలో పాల్గొన్న 251 జంటలు




సమ్మేళనంలో పాల్గొన్న 31 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు

## అ'పూర్వ'ం.. ఆత్మీయ సమ్మేళనం

నిజాంసాగర్, డిసెంబర్17: వారంతా ఒకే పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకొని నేడు వేర్వేరు రంగాల్లో వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. 31 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా, వారంతా ఒక్కచోట కలుసుకునేందుకు చిన్ననాడు చదువుకున్న నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయమే వేదికైంది. పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనానికి వివిధ రాష్ట్రాలతోపాటు విదేశాల్లో స్థిరపడినవారు కూడా తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటాపాటలతో సరదాగా గడిపారు. చిన్ననాటి చిలిపి పనులు, మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ప్రస్తుతం వారు స్థిరపడ్డ రంగాలు, అనుభవాలను మిత్రులతో పంచుకున్నారు. చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు.

**సేవా కార్యక్రమాలు..**

పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నవోదయ పాఠశాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. కామారెడ్డికి చెందిన ఒకటో బ్యాచ్ విద్యార్థిని శ్రీవాణి ప్రస్తుతం జార్జియా దేశంలో విద్యాశాఖ అడ్వైజరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె రూ. లక్షా 60వేల విరాళాన్ని అందజేయగా.. నవోదయలో బాలికల డైనింగ్ హాల్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యవతి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి రేణుకాకుమారి, నాగవేందర్, ఇమ్మానుయేల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్సులతో సందడి చేస్తున్న పూర్వ విద్యార్థిని